

**గతి తప్పిన రిమ్స్**
కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్, రిమ్స్)లో వైద్యులు, ఇతర సిబ్బంది విధి నిర్వహణ గతి తప్పుతోంది. -8లో



**ఎండీయూ ఆపరేటర్లకు చెక్**
ప్రొద్దుటూరు మండలంలో ఎండీయూ ఆపరేటర్లను కాదని చౌకదుకాణాల డీలర్ల ద్వారానే రేషన్ పంపిణీ చేసే విధంగా అధికార పార్టీ నేతలు హుకుం జారీ చేశారు. -8లో

గరిష్టం/కనిష్టం
37.5/22.9

**వాతావరణం**
జిల్లాలో మంగళవారం 22.9 - 37.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ

కడప కల్చరల్: జిల్లా గ్రంథాలయ సంస్థకు పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్‌ను నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలకు కూడా జేసీలకు ఈ బాధ్యతలు అప్పగించారు. వైఎస్సార్ జిల్లా గ్రంథాలయ సంస్థకు కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంత వరకు చైర్మన్‌ను నియమించలేదు. పరిపాలన సౌలభ్యం కోసం జేసీ అదితిసింగ్‌కు ఈ బాధ్యతలను అప్పగించారు. ఆరు నెలలపాటు ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయని, లేదా కొత్త చైర్మన్ నియామకం వరకు ఈ పరిస్థితి కొనసాగుతుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

### నేడు బీజేపీ జిల్లా అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం

కడప కోటిరెడ్డిసర్కిల్: భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా జంగిటి వెంకట సుబ్బారెడ్డి బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి బత్తల పవన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని హరిత హోటల్ సమావేశ మందిరంలో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి సత్యకుమార్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేయనున్నారని పేర్కొన్నారు. అలాగే కూటమిలోని ఎమ్మెల్యేలు, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొంటారని ఆయన వివరించారు.

### కేజీబీవీల్లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఉన్న 17 కేజీబీవీల్లో 6, 11 తరగతులలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ నిత్యానందరాజులు తెలిపారు. అలాగే 7,8,9,10,12 తరగతులలో మిగిలి ఉన్న సీట్లకు కూడా ఏప్రిల్ 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. మార్చి 31వ తేదీ నాటికి 6వ తరగతిలో 600 సీట్లు, 11వ తరగతిలో 300 సీట్లు, 7వ తరగతిలో 50 సీట్లు, 8వ తరగతిలో 30 సీట్లు, 9వ తరగతిలో 25 సీట్లు, 10వ తరగతిలో 6 సీట్లు, 12వ తరగతిలో ఒక సీటు ఖాళీ ఉన్నట్లు వివరించారు. కావున అర్హులు హెచ్‌టిటిపిఎస్://ఏపీకేజీబీవీ.ఎపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

### నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షల తేదీ ప్రకటించాలని బుధవారం కలెక్టరేట్ వద్ద డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో 2022లో 6100 కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ వచ్చిందని పేర్కొన్నారు. మూడేళ్లు గడుస్తున్నా పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారో తేదీలు ప్రకటించలేదన్నారు. ఇంతకు నిర్వహిస్తారో లేదో తెలియక అభ్యర్థులు అయోమయంలో ఉన్నారన్నారు. కూటమి అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో కానిస్టేబుల్ అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించి నియామకాలు చర్యలు చేపడతామని నారాలోకేష్ హామీ ఇచ్చారని, అయినా ఇంత వరకు అమలు చేయలేదని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ తీరుకు నిరసనగా ధర్నా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్, సహాయ కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### ఆదర్శనీయుడు అంబేడ్కర్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మేయర్ సురేష్‌బాబు, జై భీమ్ మాల మహాసేన నాయకులు

కడప కార్పొరేషన్: ఆదర్శనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని నగర మేయర్ కె.సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. జై భీమ్ మాల మహాసేన ఆధ్వర్యంలో రూపొందించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వారోత్సవాల పోస్టర్లను వారు ఆవిష్కరించారు. మంగళవారం జై భీమ్ మాల మహాసేన అధ్యక్షుడు పి.సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శి చైతన్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి రాజ్యాంగాన్ని ఇచ్చిన బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 1 నుంచి 14 వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజ్యాంగంపై అవగాహన కల్పించడానికి విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అంబేడ్కర్ విశిష్టతను స్కూల్ నుంచి కాలేజీ విద్యార్థుల వరకు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. అంబేడ్కర్ అందరి వాడని, ఆయన అన్ని వర్గాల వారికి రాజ్యాంగం ద్వారా ఫలాలు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ మాల మహాసేన కార్యవర్గ సభ్యులు వసంత్ పాల్గొన్నారు.

# అందని సాయం.. రైతన్న దైన్యం


- అమలు కాని అన్నదాత సుఖీభవ
- ముగిసిన ఖరీఫ్, రబీ సీజన్‌లు
- పంటలు పండక నష్టాల మూట
- అప్పుల పాలైన రైతాంగం



ఖరీఫ్‌లో ఎర్రగుంట్ల మండలంలో ఎండిపోయిన మినుము పంట



రబీలో అధిక వర్షాలతో నేలపాలైన వరి పైరు



కడప అగ్రికల్చర్: మా ప్రభుత్వం వస్తే రైతులకు ఏటా రూ.20 వేల పెట్టుబడి సాయం అందజేస్తామని ఎన్నికల ప్రచారంలో ఊదర గొట్టిన కూటమి నాయకులు.. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా పైసా విదిల్చలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో పంటల సాగుకోసం క్రమం తప్పకుండా పెట్టుబడి సాయం అందించింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఖరీఫ్, రబీ సీజన్‌లు ముగిశాయి. ఓ వైపు వర్షాభావం, మరో వైపు అకాల వర్షాలు, తుపానులతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల్లో కమలాపురం, వల్లూరు, వీఎన్‌పల్లి, ఎర్రగుంట్ల, వేముల మండలాల్లో దాదాపు 10 వేల ఎకరాల్లో మినుము పంట ఎండిపోయింది. వేరుశనగ, కంది, పత్తి పంటలు కూడా వాడుముఖం పట్టడంతో.. ఖరీఫ్ చివరిలో వర్షం కురిసినా అంతగా ఫలితం లేకుండా పోయింది. రబీలో తుపాను కారణంగా పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచి చాలా మేర పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా వరి, శనగ పంటలు భారీగా దెబ్బతిన్నాయి.

**మేనిఫెస్టోలో ..**

కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్‌సిక్స్‌లో ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించింది. అధికారం చేపట్టిన వెంటనే రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవగా పేరు మార్చడం మినహా.. ఇప్పటి వరకు ఎలాంటి నిధులు విడుదల చేయలేదు. జిల్లాలోని 36 మండలాల్లో 2,05,600 మంది రైతులు ఉండగా.. 1,79,001 హెక్టార్లలో భూమి ఉంది. పంటల సాగు కోసం విత్తనాలు, ఎరువులు, కూలీలతోపాటు పలు పనులకు నగదు అవసరం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి పెట్టుబడి సాయం అందకపోవడంతో చాలా మంది రైతులు అధిక వడ్డీలు, బంగారు తాకట్టు వంటివి పెట్టి అప్పులు చేశారు.

**ఠంఛన్‌గా కేంద్ర ప్రభుత్వ సాయం**

పీఎం కిసాన్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రైతులకు ఠంఛన్‌గా సాయం అందిస్తోంది. ఇందులో భాగంగా ఏడాదికి మూడు విడతల్లో రూ.6 వేల సాయం అందజేస్తామని ప్రకటించింది. ఈ మేరకు జూన్ నెలలో రూ. 2 వేలు, అక్టోబర్‌లో రూ.2 వేల చొప్పున విడుదల చేసింది. తాజాగా మార్చి మొదటి వారంలో మూడో విడత కింద జిల్లాలో 1.89 లక్షల మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున రూ. 37.88 కోట్లు ఖాతాల్లో జమ చేసింది.

### వైఎస్సార్‌సీపీ పాలనలో ఆరంభంలోనే..

రైతులు పంటల సాగు కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్ ఆరంభంలోనే పెట్టుబడి సాయం (వైఎస్సార్ రైతు భరోసా) అందించి అన్నదాతలకు అండగా నిలిచింది. ఏటా క్రమం తప్పకుండా ఈ మొత్తాన్ని అందించింది. పీఎం కిసాన్ సాయం కింద రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7500 మొత్తం కలిపి ఏడాదికి రూ.13500 అందజేసింది. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో రైతు ఖాతాలకు జమ చేసింది. ఇందులో ఖరీఫ్ ప్రారంభం, రెండవది కోతల సమయం, మూడవది ధాన్యం ఇంటికి చేరే వేళ అందించారు. ఇలా వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద ఐదేళ్లపాటు రూ.1191.03 కోట్లను అన్నదాతలకు అందించి అండగా నిలిచింది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు ఏడాదికి రాష్ట్ర వాటా కింద రూ.14 వేలు అందిస్తామని ప్రకటించింది. అంటే ఏడాదికి కేవలం రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లా రైతాంగానికి రూ. 294.67 కోట్లు అందనుంది. అలాగే గత ప్రభుత్వం కంటే అదనంగా ప్రతి రైతులకు ఏడాదికి రూ.6500 చొప్పున లబ్ధి చేకూరనుంది. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా 210481 మంది రైతులకు ఏడాదికి అదనంగా 136.81 కోట్లు అందనుంది. అంటే జిల్లా రైతాంగానికి రైతు భరోసా, పీఎం కిసాన్ రెండు కలిపి ఏడాదికి రూ. 431.48 కోట్లు అందనుంది. ఈ మొత్తాన్ని కూటమి ప్రభుత్వం జిల్లా రైతుల ఖాతాలకు ఏడాదికి జమ చేయాల్సి ఉంటుంది.

**వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విడుదల చేసిన రైతు భరోసా, పీఎం కిసాన్ నిధులు**

| సంవత్సరం | రైతుల సంఖ్య | విడుదలైన నిధులు (రూ.కోట్లలో) |
|---|---|---|
| 2019-20 | 206708 | 279.93 |
| 2020-21 | 208747 | 280.06 |
| 2021-22 | 199344 | 269.11 |
| 2022-23 | 202598 | 235.68 |
| 2023-24 | 210481 | 126.25 |

**నష్ట పరిహారం అందలేదు**



నేను ఎకరాకు రూ.10 వేలు పెట్టి 5 ఎకరాల్లో మినుము పంట సాగు చేశాను. వర్షాలు కురవక పంట పండకపోవడంతో దున్నేశాను. పెట్టుబడి కూడా దక్కక పోగా.. చేసిన కష్టం, శ్రమ వృథా అయింది. కుటుంబ పోషణ, పంటల సాగు కోసం అప్పులు చేయాల్సి వచ్చింది. ప్రభుత్వం నష్టపరిహారం ఒక్క రూపాయి కూడా అందించలేదు. – నాగేశ్వరరెడ్డి, కంచన్నగారిపల్లె, కమలాపురం మండలం

**2014లోనూ ఇంతే..**



2014లోనూ చంద్రబాబు సవాలక్ష షరతులు విధించి చివరికి లక్ష యాభై వేల రూపాయలు ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. అయినప్పటికీ బ్యాంకుల్లో రూ.50 వేలకు పైగా రుణాల ఉన్న వారు డిఫాల్టర్లుగా మారారు. ఇప్పుడు కూడా అదే విధంగా వ్యవహరిస్తున్నట్లుగా ఉంది.
– పి.భాస్కర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి (సీపీఐ అనుబంధ, రైతు విభాగం)

**గత ప్రభుత్వంలో..**



గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే నాటికి పెట్టుబడి సాయం రైతుల ఖాతాలో జమ అయ్యేది. టీడీపీ అధికారంలోకి వచ్చి 9 నెలలు దాటినా రైతు ఖాతాలకు నగదు జమ చేయకుండా మీనమేషాలు లెక్కిస్తోంది. –దస్తగిరిరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి, (సీపీఎం అనుబంధ, రైతు విభాగం)

## 16 మంది ఎస్‌ఐల బదిలీ



కడప అర్బన్: వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా 16 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయప్రవీణ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఎస్ఐల వివరాలిలా వున్నాయి.

| ఎస్ఐ పేరు | ప్రస్తుతం | బదిలీ |
|---|---|---|
| పి.హైమవతి | డీఎస్‌బీ, కడప | జమ్మలమడుగు |
| టి.కల్పన | జమ్మలమడుగు యూ/జీ.పీఎస్ | డీఎస్‌బీ, కడప |
| పి.తులసీనాగప్రసాద్ | సింహాద్రిపురం | కడప తాలూకా పీఎస్ |
| కె.ప్రదీప్‌నాయుడు | కడప తాలూకా | డీఎస్‌బీ, కడప |
| బి.పెద్ద ఓబన్న | తొండూరు | వల్లూరు |
| బి.అరుణ్‌రెడ్డి | డీఎస్‌బీ, కడప | ప్రొద్దుటూరు రూరల్ |
| ఎం.మహమ్మద్ రఫీ | కలమల్ల పీఎస్ | సిద్ధవటం పీఎస్ |
| ఎల్.తిమోతీ | కలమల్ల పీఎస్ | కలసపాడు |
| బి.ఘనమద్దిలేటి | కలసపాడు పీఎస్ | తొండూరు పీఎస్ |
| యు.వై.జయరాముడు | రిమ్స్ పీఎస్ | కలమల్ల పీఎస్ |
| వి.మల్లికార్జునరెడ్డి | డీఎస్‌బీ, కడప | కడప ఒన్‌టౌన్ పీఎస్ |
| జె.రవికుమార్ | బద్వేల్ యూ/జీ పీఎస్ | సింహాద్రిపురం |
| ఎ.విద్యాసాగర్ | కొండాపురం పీఎస్ | కమలాపురం పీఎస్ |
| యు.ప్రతాప్‌రెడ్డి | కమలాపురం పీఎస్ | కొండాపురం పీఎస్ |
| ఆర్‌పీఎస్‌ఐలు | | |
| కె.జయరామిరెడ్డి | వీఆర్, కడప | బద్వేల్ యూ/జీపీఎస్ |
| ఎస్.శ్రీనివాసులు | వీఆర్, కడప | డీఎస్‌బీ, కడప |

# వేగంగా రెవెన్యూ సమస్యల పరిష్కారం

కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో రెవెన్యూ సమస్యలు వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్ లో పీజీఆర్ఎస్ అర్జీలు, రెవెన్యూ సదస్సులు, రీ సర్వే, గ్రామసభలు, తదితర రెవెన్యూ సమస్యలపై కలెక్టర్ జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలిసి జిల్లా రెవెన్యూ అధికారి, రెవెన్యూ డివిజన్ల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, పులివెందుల ఆర్డీవో చిన్నయ్య, బద్వేల్ చంద్రమోహన్, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, కలెక్టరేట్ ఏవో విజయ్ కుమార్ తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**ఐటీ పార్కు ఏర్పాటుకు స్థల పరిశీలన**

జిల్లాలో ఐటీ పార్కు ఏర్పాటు కోసం స్థానిక ఎమ్మెల్యే ఆర్.మాధవిరెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మంగళవారం రిమ్స్ సమీపంలోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. కడప నగర శివార్లలోని పుట్లంపల్లె పంచాయతీ పరిధిలో పాలకొండ వద్ద ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమికి సంబంధించి రికార్డులు, మ్యాపులను పరిశీలించారు. చుట్టు పక్కల గతంలో ఇతరులకు కేటాయించిన ప్రభుత్వ స్థలాల వివరాలను కూడా జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, కడప తహసీల్దార్ నారాయణరెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**పాత కలెక్టరేట్, పాత రిమ్స్ పరిశీలన**

పోటీ పరీక్షలకు సంసిద్ధం అయ్యే విద్యార్థుల కోసం బీసీ వెల్ఫేర్ భవన్‌ను మరింత వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. స్థానిక పాత రిమ్స్, పాత కలెక్టరేట్లోని ప్రాంగణాలు, భవనాలను ఆయన కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా పాత రిమ్స్‌లోని ఖాళీ స్థలాలు, ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం పాత రిమ్స్ వెనుక భాగంలో నూతనంగా నిర్మించిన బీసీ వెల్ఫేర్ భవనాన్ని బీసీ సంక్షేమ శాఖ అధికారితో కలిసి మీటింగ్ హాలు, తరగతి గదులు, ఇతర రూములను పరిశీలించారు. అనంతరం పాత కలెక్టరేట్‌లోని ప్రాంగణాలు, గదులను పరిశీలించి అక్కడి గత వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి భరత్ కుమార్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# హమ్మయ్య.. అయిపోయాయ్!

- ముగిసిన పదో తరగతి పరీక్షలు
- నిర్వహణలో పలు లోపాలు
- ఇద్దరు ఇన్విజిలేటర్లు, ఒక చీఫ్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ సస్పెండ్
- ఇద్దరు విద్యార్థులు డీబార్



కడపలో పదో తరగతి పరీక్ష రాసి బయటికి వస్తున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షలు నిర్వహణ లోపాలు, ఆటుపోట్ల మధ్య ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా గత నెల 17వ తేదీన ప్రారంభమైన పరీక్షలు ఏప్రిల్ 1న ముగిశాయి. జిల్లాలో 161 పరీక్షా కేంద్రాల్లో 27,800 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. ప్రారంభంలో ప్రశాంతంగా మొదలైనా.. తరువాత పలు ఆరోపణలు ఎదుర్కోవాల్సి వచ్చింది. 19న నిర్వహించిన హిందీ పరీక్షకు సంబంధించి కడప ప్రభుత్వ బాలికల హైస్కూల్ సెంటర్‌లో ఒక విద్యార్థి ఏకంగా సెల్‌ఫోన్‌ను జేబులో ఉంచుకుని హాజరయ్యాడు. దీంతో ఆ విద్యార్థిని డీబార్ చేయడంతోపాటు ఆ పరీక్ష గదిలో విధులు నిర్వర్తించిన ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేశారు. అలాగే 24న గణితం పరీక్ష ప్రశ్నాపత్రం వల్లూరు జెడ్పీ హైస్కూల్ కేంద్రంలో వాటర్‌బాయ్ వాట్సాప్ ద్వారా లీక్ అయింది. ఇందుకుగాను ఆ పరీక్షా కేంద్రంలో ఇన్విజిలేటర్‌తోపాటు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారితో కలిపి ముగ్గురిని సస్పెండ్ చేశారు. అలాగే ఒక విద్యార్థిని కూడా డీబార్ చేశారు. అలాగే ఈ సంఘటనకు సంబంధించి ఇన్విజిలేటర్‌తోపాటు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారితోపాటు మరో ఆరుగురిపై పోలీసు కేసులు నమోదు చేశారు.

**చివరిరోజు 144 మంది గైర్హాజరు**

చివరి రోజైన మంగళవారం సాంఘిక శాస్త్రం పరీక్షకు 144 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా రెగ్యులర్‌కు సంబంధించి 27,768 మంది విద్యార్థులకు గాను 27,624 మంది హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులకు సంబంధించి 22 మందికి గాను 19 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. సిట్టింగ్ స్క్వాడ్ 84 పరీక్షా కేంద్రాలు, 7 స్క్వాడ్ బృందాలు 50 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా నోడల్ ఆఫీసర్ మధుసూదన్‌రావు నాలుగు, డీఈఓ షేక్ షంషుద్దీన్ 5 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

### ఇంటర్ కళాశాలలు పునఃప్రారంభం

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఏప్రిల్ 1న ప్రభుత్వం ఇంటర్ జూనియర్ కళాశాలలను పునఃప్రారంభించింది. గతానికి భిన్నంగా ఈ ఏడాది పరీక్షలు ముగిసిన పది రోజులకు ఇంటర్ కళాశాలల(ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు) ప్రారంభించింది. అయితే మొదటి రోజు విద్యార్థుల హాజరు శాతం భారీగా పడిపోయింది. సాధారణంగా ఏటా జూన్ 1న ఇంటర్ కళాశాలలు పునఃప్రారంభమవుతాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నూతనంగా ఏప్రిల్ 1న కళాశాలలను ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో.. తొలి రోజు 2676 మంది విద్యార్థులకు గాను కేవలం 388 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు.

**పుస్తకాల పరిస్థితేంటో..!**

ఏప్రిల్ 1నే ప్రభుత్వం కళాశాలలను ప్రారంభించింది. అయితే విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలను మాత్రం అందించలేదు. దీంతో కొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రం పుస్తకాలను ఇవ్వకుండా.. కళాశాలల ప్రారంభిస్తే వారు ఎలా చదువుకుంటారని ప్రశ్నిస్తున్నారు. మొదటి రోజే పిల్లలకు పుస్తకాలను అందించి ఉంటే బాగుండేదని పలువురు విద్యావేత్తలు అంటున్నారు. ఈ విషయమై ఆర్ఐవో వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రెండు, మూడు రోజుల్లో పాఠ్యపుస్తకాలను పిల్లలకు అందజేస్తామని తెలిపారు.

# మూల్యాంకనానికి వేళాయె

- పదో తరగతి పేపర్లు దిద్దేందుకు ఏర్పాట్లు పూర్తి
- 3 నుంచి 9 వరకు నిర్వహణ



పరీక్ష రాసిన అనంతరం విజయసంకేతం చూపుతున్న విద్యార్థులు

### 1515 మంది సిబ్బంది ఏర్పాటు

రాష్ట్ర వ్యాప్తంగా మూల్యాంకనానికి రానున్న దాదాపు 1,80,965 పేపర్లను మూల్యాంకనం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 1515 మంది సిబ్బందిని విధులకు ఏర్పాటు చేశారు. ఇందులో చీఫ్ ఎగ్జామినేటర్లతోపాటు అసిస్టెంట్ ఎగ్జామినర్లను కలిపి 1104 మందిని, స్పెషల్ అసిస్టెంట్లుగా 411 మందిని నియమించారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకనం నిర్వహించనున్నారు. విధులకు హాజరయ్యే సిబ్బందికి అన్ని రకాల మౌలిక వసతులను ప్రభుత్వ పరీక్షల విభాగం ఏర్పాటు చేసింది.

కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు మంగళవారం ముగిశాయి. విద్యార్థులు రాసిన సమాధాన పత్రాలను దిద్దేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏప్రిల్ 3 నుంచి 9వ తేదీ వరకు ఈ ప్రక్రియ నిర్వహించనున్నారు. కడప మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)లో ప్రభుత్వ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇక్కడికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 1,80,965 పేపర్లు రానున్నాయి. జిల్లాలో 1515 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. వీరిలో జవాబు పత్రాలకు మూల్యాంకనం నిర్వహించే అసిస్టెంట్ ఎగ్జామినర్లతోపాటు పరిశీలించేందుకు చీఫ్ ఎగ్జామినర్, స్పెషల్ అసిస్టెంట్లను ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ షంషుద్దీన్ క్యాంపు ఆఫీసర్, డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి డిప్యూటీ క్యాంపు ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. మరో ఏడుగురు అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లుగా వ్యవహరించనున్నారు.

**ఆరుగురు ఏఈలకు ఒక సీఈ, ఇద్దరు స్పెషల్ అసిస్టెంట్లు:** విద్యార్థుల సమాధాన పత్రాలను మూల్యాంకనం చేసేందుకు ఆరుగురు చొప్పున అసిస్టెంట్ ఎగ్జామినర్లు(ఏఈ), ఒక చీఫ్ ఎగ్జామినర్‌తోపాటు ఇద్దరు స్పెషల్ అసిస్టెంట్లను ఒక బృందంగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ బృందంలోని ఒక్కొక్క ఏఈ రోజుకు 40 సమాధాన పత్రాలను మూల్యాంకనం చేస్తారు. ఏఈలు మూల్యాంకనం చేసిన పత్రాలను సీఈలు క్షుణంగా పరిశీలిస్తారు. విద్యార్థులు రాసిన సమాధానాలు సరైనవి, కానివి పరిశీలించి వేసిన మార్కులను నిశిత పరిశీలన చేస్తారు. అదే విధంగా సమాధాన పత్రాలు, ఏఈలు వేసిన మార్కులను కూడి మొత్తం మార్కులను వేసే విధులను స్పెషల్ అసిస్టెంట్లు నిర్వహిస్తారు.

**నిబంధనలు అమలు**

పదో తరగతి మూల్యాంకనంలో పాల్గొనే సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయనున్నారు. మూల్యాంకనం జరుగుతున్న వైపు ఇతరులు రాకుండా ఆంక్షలు విధిస్తున్నారు. విధుల్లో పాల్గొనే సిబ్బంది సెల్‌ఫోన్, ఇతర ఎల్రక్టానిక్ పరికరాలను వెంట తీసుకెళ్లడానికి వీలు లేకుండా నిబంధనలు జారీ చేయనున్నారు.

## క్లుప్తంగా

### పదో తరగతి విద్యార్థిని అదృశ్యం

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని కాకులవరం గ్రామానికి చెందిన పదోతరగతి విద్యార్థిని చివరిరోజు పదో తరగతి పబ్లిక్ పరీక్ష రాసి కనిపించలేదని బాలిక తల్లిదండ్రులు లక్కిరెడ్డిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి బాలిక కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ రవీంద్ర బాబు తెలిపారు.

### వామ్మో.. ఎలుగుబంటి



ఎలుగుబంటి

అట్లూరు : అట్లూరు మండల పరిధిలోని కొండూరు గ్రామంలో ఎలుగుబంటి సంచారం గ్రామస్తులను హడలెత్తిస్తోంది. అసలే ఎండలు ఆపై ఉక్కపోత తట్టుకోలేక రాత్రివేళల్లో గ్రామస్తులు ఆరుబయట నిద్ర పోతున్నారు. ఈ నేపథ్యంలో గత నాలుగు రోజులుగా నల్లకుంట చెరువు లోని కంపచెట్ల నుంచి రాత్రి వేళల్లో ఎలుగుబంటి వీధుల్లోకి వస్తోంది. దీంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. అయితే కుక్కలు వెంటబడడంతో ఎలుగుబంటి కంపచెట్లలోకి వెళుతోందని, ఎప్పుడు ఎవరి మీద పడి దాడి చేస్తుందో అని గ్రామస్తులు బిక్కుబిక్కుమంటున్నారు.

### కడప ఉక్కు పరిశ్రమపై స్పందించాలి

ప్రొద్దుటూరు : కడప ఉక్కు పరిశ్రమపై రాయలసీమ మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందించాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జగన్ తెలిపారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలో కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారన్నారు. 11 ఏళ్లు అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కడప ఉక్కు పరిశ్రమ గురించి పట్టించుకోవడం లేదన్నారు. కేవలం ఉక్కు పరిశ్రమను శంకుస్థాపనలకే పరిమితం చేశారన్నారు. రాయలసీమ ప్రజలను ఓట్లు, సీట్ల కోసం వాడుకుంటున్నారే తప్ప అభివృద్ధి చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు.

### ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య



రామతులసి మృతదేహం

పోరుమామిళ్ల : మండలంలోని రాజాసాహేబ్‌పేట పంచాయతీ తిరువెంగళాపురానికి చెందిన కల్లూరి రామతులసి(25) మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. వివాహ సంబంధాల విషయంలో ఆమె తీవ్ర అసంతృప్తితో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు తండ్రి జయరామిరెడ్డి పోలీసులకు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

# గతి తప్పిన రిమ్స్

- ఉదయం 9:20 అవుతున్నా విధులకు రాని ఆర్థోపెడిక్ వైద్యులు
- వైద్య సిబ్బంది డ్యూటీ చార్ట్‌లలో నకిలీ విలేకరుల ప్రమేయం
- మెడికల్ రీ ఎంబర్స్‌మెంట్ బిల్లుల మంజూరులో 'చేతులు తడపాల్సిందే'
- ఎమ్మెల్యే మనిషినంటూ ఓపీ క్యాంటీన్‌కు తాళాలు వేసినా పట్టించుకోని అధికారులు



ఉదయం 9:20 సమయం దాటినా మహిళా ఆర్థోపెడిక్ విభాగానికి హాజరుకాని వైద్యులు



ఆర్థోపెడిక్ విభాగం డ్యూటీ చార్ట్‌లో ఉన్న వైద్యుల జాబితా

కడప టాస్క్‌ఫోర్స్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్, రిమ్స్)లో వైద్యులు, ఇతర సిబ్బంది విధి నిర్వహణ గతి తప్పుతోంది. ఇక్కడ పనిచేస్తున్న వైద్యుల్లో చాలామంది తమ విధులను చిత్తశుద్ధితో నిర్వహిస్తుంటారు. వీరుగాక కొందరు వైద్యులు మాత్రం తమకు నచ్చిన, తమను మెచ్చిన వైద్యులతో కలిసి చెట్టాపట్టాలేసుకుని 'రిమ్స్' ప్రాంగణంలోనే తిరుగుతూ అందరినీ విస్మయానికి గురిచేస్తున్నారు. కొందరు డాక్టర్లు తమ కేమీ పట్టనట్లు బయోమెట్రిక్, ఎఫ్ఆర్ఎస్ వేసిన తరువాత అలా బయటకు వెళ్లి టిఫిన్‌లు, కాఫీలను ముగించుకుని ఎంచక్కా 9 గంటలకు పైగా తమకు నచ్చిన సమయంలో వచ్చి విధులను నిర్వహిస్తుంటారు. మరికొందరు ఇంటి నుంచి తమ, తమ సొంతకారులో ఐపీ విభాగానికి వారి వార్డులకు వెళ్లి అక్కడ విధులను నిర్వహిస్తున్న హౌస్‌సర్జన్‌లు, పీజీలకు విధులను అప్పజెప్పి 'హాయ్, బాయ్' అని చెపుతూ తమదారిన తాము కారు పార్కింగ్ దగ్గరకు వచ్చేస్తారు. తరువాత రిమ్స్ ఆవరణంలోనూ, రిమ్స్ ఆవరణం చుట్టూ బైపాస్ రోడ్లలోకి వెళ్లి తమ 'ఇష్టాలు, కష్టాలు' పంచుకుని మరలా వైద్యాధికారులు రౌండ్స్‌కు వచ్చే సమయానికి ఎంచక్కా విధులకు హాజరై కాలక్షేపం చేసి సమయం పూర్తికాగానే ఎవరిదారిన వారు వెళ్లిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

■ మంగళవారం ఓపీ విభాగంలో కొన్ని విభాగాలలో హెచ్ఓడీలు, వైద్యులు ఎంచక్కా విధులకు వస్తే కొన్ని విభాగాలలో మాత్రం హౌస్‌సర్జన్‌లు, పీజీ వైద్యులు మాత్రమే వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నారు. మహిళా ఆర్థోపెడిక్ విభాగానికి వైద్యులు అస్సలు అరగంటపైగా దాటినా రాకపోవడం గమనార్హం. ఈ విధులకు హాజరుకాని వైద్యులలో ఇద్దరు గతంలో బయోమెట్రిక్‌కు వేలిముద్రలు మాయం చేసి, అవి అధికారుల దృష్టికి వెళ్లడం, ప్రతి చర్యగా సదరు వైద్యులను కొన్ని నెలలపాటు కలెక్టరేట్‌లో విధులు నిర్వహించేలా చేసినా వారి పద్ధతిని మార్చుకోలేదనే ప్రజలు అనుకుంటున్నారు.

■ పరిపాలనా విభాగంలో ఉద్యోగులకు, పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన మెడికల్ రీ ఎంబర్స్‌మెంట్ 'బిల్లులు' మంజూరు కావాలంటే తప్పనిసరిగా 'చేయి తడపాల్సిందే'. తమకు అనూకూలంగా పర్సెంటేజీల వంతుగా చేతులు తడిపితే కానీ ఫైళ్లు ముందుకు కదలవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులైనా, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, వైద్యులకైనా ఈ తిప్పలు తప్పడం లేదంటున్నారు.

■ ఇక్కడ పనిచేస్తున్న కొన్ని విభాగాల వైద్య సిబ్బంది విధులకు సంబంధించిన డ్యూటీ చార్ట్‌లను వేయడంలో కొందరు నకిలీ విలేకరుల ప్రమేయం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కొందరు మహిళా అధికారులను ఏకంగా సదరు నకిలీ విలేకరులు, ఫోన్‌లలో బెదిరించడం సదరు అధికారులు, మహిళా సిబ్బంది తమకు ఏమీ పట్టనట్లుగా, తాము ఎవరికైనా చెప్పుకుంటే తమ పరువు, ప్రతిష్టలకు భంగం కలిగినట్లుగా భావిస్తూ 'పంటి బిగువు'న ఆ వేధింపులను, వెకిలి చేష్టలను సైతం భరిస్తున్నట్లు తెలుస్తోంది.

**ఎమ్మెల్యే మనిషినంటూ ఓపీ క్యాంటీన్‌కు తాళం..**

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఓపీలో క్యాంటీన్ సేవలు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉండేవి. ఈ క్యాంటీన్‌కు వచ్చే రోగులు, వారి సహాయకులు బయటకు వెళ్లకుండానే తక్కువ ధరలకే టీ, కాఫీ, వాటర్ బాటిళ్లు, ఇతర అల్పాహార సేవలను పొందేవారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది కూడా సేవలను అందుకునేవారు. కాస్త ఉపశమనం పొందేవారు. గడువు ముగిసిన తరువాత అధికారులు నిబంధనల మేరకు టెండర్లను పిలవకుండానే.. మంగళవారం ఉదయం ఎమ్మెల్యే మనిషినంటూ ఓ వ్యక్తి వచ్చి క్యాంటీన్‌కు తాళం వేసి ఎంచక్కా వెళ్లాడు. ఓ ప్రైవేట్ వ్యక్తి వచ్చి తాను ఎమ్మెల్యే మనిషినంటూ క్యాంటీన్‌కున్న రెండు వాకిళ్లకు తాళాలు వేసుకుని వెళ్లడం ఎంతవరకు సమంజసమని సామాన్య ప్రజలు సైతం తప్పుపడుతున్నారు. ఈ వ్యవహారం తెలిసినా తమకేమీ పట్టనట్లు, తెలియనట్లు అధికారులు సైతం వ్యవహరించడం కొసమెరుపు.




జీజీహెచ్‌లో పరిపాలనా విభాగం



రిమ్స్ ఓపీలో ఎమ్మెల్యే మనిషినంటూ తాళం వేసుకుని వెళ్లిన ప్రైవేటు వ్యక్తి

### ఈత కొమ్మలకు భలే గిరాకీ



ఈత కొమ్మలను విక్రయిస్తున్న వ్యక్తులు

పులివెందుల రూరల్ : వేసవి కాలంలో ఈత కొమ్మలకు భలే గిరాకీ ఏర్పడింది. రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు ఈత కొమ్మలను కొనుగోలు చేసి వాటిని అరటి మొక్కలకు అండగా ఈత కొమ్మలను నాటుతారు. పులివెందుల ప్రాంతంలో అరటిని ఎక్కువ సాగు చేయడంవల్ల అరటి పిలకలు నాటినప్పుడు ఆ పిలకలు ఎండ వేడిమి నుంచి, వివిధ రకాల అడవి జంతువుల బారి నుంచి కాపాడుకునేందుకు ఈత కొమ్మలను రైతులు అరటి పిలకల పక్కనే నాటుతారు. హిందూపురం, పెనుగొండ, సత్యసాయి, అనంతపురం ప్రాంతాల నుంచి ఈత కొమ్మలను చెట్ల నుంచి కోసుకొని వచ్చి పులివెందుల ప్రాంతంలో ఒక్కో ఈత కొమ్మను రూ.5ల చొప్పున విక్రయిస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు.

### గ్యాస్ సిలిండర్ లారీ బోల్తా

సంబేపల్లె : చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారిపై సంబేపల్లె వద్ద మంగళవారం తెల్లవారుజామున గ్యాస్ సిలిండర్ లారీ బోల్తా పడింది. కడప నుంచి సిలిండర్ ఫుల్ లోడుతో నిమ్మనపల్లెకు వెళుతున్న లారీ మండల కేంద్రంలోని వడ్డపల్లె క్రాస్ రోడ్డు సమీపంలోకి రాగానే అదుపు తప్పి డివైడర్ ఎక్కడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ శివకు గాయాలయ్యాయి.

## విద్యార్థిని పట్ల అసభ్య ప్రవర్తనపై విచారణ



స్కూల్ కరస్పాండెంట్‌ను విచారిస్తున్న ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని శివానగర్‌లో గల లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో గత నెల 29న 4వ తరగతి విద్యార్థిని పట్ల అన్వర్‌బాషా అనే ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై మంగళవారం ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి విచారణ చేపట్టారు. జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ విచారణలో భాగంగా తొలుత పాఠశాలకు వెళ్లి పాఠశాల కరస్పాండెంట్‌ను, తోటి ఉపాధ్యాయులను విచారించారు. అలాగే అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు ఎన్ని నెలలుగా పాఠశాలలో పనిచేస్తున్నాడనే విషయంపై ఆరాతీశారు. అనంతరం విద్యార్థిని తల్లిదండ్రులను విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టామని, విచారణలో సేకరించిన వివరాలను నివేదిక రూపంలో జిల్లా విద్యాశాఖాధికారికి అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట ఎంఈఓలు చెన్నయ్య, రఘురాములు, సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ఎదుట ట్రాన్స్‌జెండర్ల ఆందోళన



కడప ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించిన ట్రాన్స్‌జెండర్లు

కడప అర్బన్ : సహచర ట్రాన్స్‌జెండర్‌కు మోసం చేసిన కడప నగరం అశోక్ నగర్ చెందిన యువకుడిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కడప నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద పలువురు ట్రాన్స్‌జెండర్‌లు మంగళవారం ఆందోళన నిర్వహించారు. వివరాలు ఇలా..దేవి అనే ట్రాన్స్‌జెండర్‌ను సతీష్ అనే యువకుడు ప్రేమ పేరుతో పెళ్లి చేసుకుంటానని చెప్పాడన్నారు. అయితే దేవి ఆరోగ్యం బాగా లేదని వదిలేశాడన్నారు. దీంతో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగేంత వరకు ఆందోళన విరమించమని కూర్చున్నారు. ఈ ఆందోళనపై స్పందించిన కడప వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బాధితురాలికి న్యాయం జరిగేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఫిర్యాదు చేసిన ట్రాన్స్‌జెండర్‌లతో పాటు యువకుడిని పిలిపించి సీఐ బి.రామకృష్ణ మాట్లాడారు. సమస్య సద్దుమణగడంతో వారు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో కడప ఒన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.




## నేడు కలెక్టరేట్ ఎదుట నిరసన



మాట్లాడుతున్న రాష్ట్ర ఫ్యాప్టో కార్యవర్గ సభ్యుడు సయ్యద్ ఇక్బాల్

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్‌సీ, ఐఆర్, డీఏ బకాయిల విడుదల, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, మెడికల్ బిల్లుల రీఎంబర్స్‌మెంట్, కారుణ్య నియామకాలు తదితర సమస్యల సాధన కోసం ఫ్యాప్టో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు 2వ తేదీ బుధవారం కడప కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం కడపలోని ఎస్టీయూ కార్యాలయంలో నిరసన కార్యక్రమానికి సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఫ్యాప్టో కార్యవర్గ సభ్యుడు సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ 2వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఇలియాస్ బాషా ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్ ఆర్.అబ్దుల్లా, నాయకులు ఖాదర్ బాషా, రాజశేఖర్, నరసింహారావు, సాజిద్, బాలగంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా యాక్టివిస్ట్‌పై టీడీపీ వర్గీయుల దాడి



చికిత్స పొందుతున్న మిట్టా మాధవరెడ్డి

చెన్నూరు(వల్లూరు) : మండల కేంద్రమైన చెన్నూరులో సోమవారం రాత్రి టీడీపీ వర్గీయులు సోషల్ మీడియా యాక్టివిస్ట్ మిట్టా మాధవరెడ్డిపై దాడి చేశారు. టీడీపీ నేతలు, మద్దతుదారులు చేస్తున్న అక్రమాలను వెలుగులోకి తెస్తూ, వారి అక్రమ ధనార్జనకు అడ్డుగా మారాడనే అక్కసుతో ఆ పార్టీకి చెందిన వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వివరాలిలా.. చెన్నూరుకు చెందిన మిట్టా మాధవరెడ్డి అనే వ్యక్తి సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ మండలంలో టీడీపీ నేతలు, వారి అనుచరులు చేస్తున్న అక్రమాలను సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి తెస్తున్నాడు. అక్రమార్జనే ధ్యేయంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న టీడీపీ వర్గీయులకు ఇది కంటగింపుగా మారింది. తమ ఆదాయాలకు గండి కొడుతున్నాడనే కారణంగా అతనిపై కక్ష పెంచుకున్న టీడీపీ వర్గీయులు అదును కోసం వేచి ఉన్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి చెన్నూరులోకి కొత్త రోడ్డులో గల ఒక హోటల్‌లో ఉన్న మాధవ రెడ్డిపై టీడీపీ వర్గీయులు మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన మాధవరెడ్డిని పోలీసులు 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు.

**పరామర్శించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు**

సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథరెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాధవరెడ్డిని పరామర్శించారు. దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# కరువు మండలాల ప్రకటనలో అన్యాయం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో కడప జిల్లాలోని పడమటి ప్రాంతాలను ప్రధానంగా మెట్ట ప్రాంత మండలాలను విస్మరించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 9 మండలాల్లో తీవ్ర కరువు, 1 మండలంలో సాధారణ కరువు ఉన్నట్లు మొత్తం పది మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అయితే ఎలాంటి నీటి పారుదల సౌకర్యం లేని కమలాపురం, పులివెందుల, జమ్మలమడుగు, బద్వేలు నియోజకవర్గాల్లోని మెట్ట (వర్షాధారం) మండలాలను ప్రకటించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. కరువు మండలాల సంఖ్య పెరిగే కొద్దీ పంటల బీమా పెట్టుబడి రాయితీ పరిహారం చెల్లించాల్సి వస్తుందని ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగానే కరువు మండలాలను తగ్గిస్తూ వస్తున్నాయని ఆరోపించారు. ఉచితంగా పశుగ్రాస విత్తనాలు, పశువుల దాణా మంజూరు చేయాలన్నారు. వలసలను నివారించేందుకు ఉపాధి హామీ దినాలను పెంచాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కేసీ బాదుల్లా పాల్గొన్నారు.

**పశ్చిమ మండలాలను విస్మరించారు..**

కడప జిల్లా పశ్చిమ ప్రాంతంలోని మండలాల్లో గత ఖరీఫ్, రబీ సీజన్‌లో అతివృష్టి, అనావృష్టితో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని ఆ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరిరెడ్డి కోరారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలోని రైతు సంఘాలతో గాని, వివిధ పార్టీల ప్రతినిధులతో గాని మాట్లాడకుండా, జిల్లాలోని అన్ని మండలాలు పర్యటించకుండా, రైతాంగంతో మాట్లాడకుండా, జిల్లా ఉన్నతాధికారులు ఇచ్చిన అరకొర సమాచారంతో కేంద్ర ప్రభుత్వ కరువు బృందం జిల్లాలోని 10 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిందన్నారు. ఆ మండలాల్లో కడప జిల్లా పశ్చిమ మండలాలు ఏ ఒక్కటీ లేకపోవడం దారుణమన్నారు. జిల్లా వ్యాప్తంగా 36 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల కరువు విలయతాండవం చేస్తున్నప్పటికీ, కేవలం పది మండలాలనే కరువు ప్రాంతాలుగా గుర్తించడం అన్యాయమన్నారు.

## చిన్నపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ఎం.చంద్రశేఖరరెడ్డి

పులివెందుల రూరల్ : చిన్నపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడితే పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని జూనియర్ సివిల్ జడ్జి ఎం.చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పులివెందుల ప్రభుత్వ గిరిజన సమీకృత బాలికల వసతి గృహంలో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చిన్నపిల్లలపై రోజు రోజుకు పెరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలను నిరోధించేందుకు సుప్రీం కోర్టు 2012 నవంబర్ 12వ తేదీన పోక్సో చట్టం ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ కిశోర్ కుమార్ రెడ్డి. పాలగిరి ప్రకాష్, వార్డెన్ కళావతి, పోలీసు సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ల కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ అవకాశం

**పైలెట్ ప్రాజెక్టుగా కడప అర్బన్ కార్యాలయం**

కడప కోటిరెడ్డిసర్కిల్ : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రద్దీని తగ్గించేందుకు రాష్ట్ర స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్స్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకు రానున్నారు. ఏదైనా ఆన్‌లైన్ కేంద్రంలో ముందుగా సంబంధిత రిజిస్ట్రేషన్‌కు సంబంధించి అనువైన ఖాళీ ఉన్న సమయంలో శ్లాట్‌ను బుక్ చేసుకోవాలి. అందులో కేటాయించిన సమయంలో కార్యాలయానికి వెళ్లి వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకునే వెసులుబాటును కల్పించారు. జిల్లాలోని ఒక్కో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 39 శ్లాట్‌లను కేటాయించారు. ఇందులో కడప అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మొదట పైలెట్ ప్రాజెక్టు కింద శ్లాట్ బుక్ చేసుకునే విధానాన్ని అమలులోకి తీసుకు వచ్చారు. అందులోని ఇబ్బందులను అధిగమించి జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయనున్నారు. శ్లాట్‌బుక్ చేసుకుని, దస్తావేజును మొత్తం సిద్ధం చేసుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది.

**అవగాహన కల్పిస్తున్నాం**

ఈ విధానం చాలా సులభతరం. శ్లాట్ విషయంలో కొన్ని రోజులపాటు ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ఇందులో పెద్దగా ఇబ్బందులు ఏమీ ఉండవు. గంటలకొద్ది వేచి ఉండకుండా త్వరగా రిజిస్ట్రేషన్ చేయించి పంపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నూతన విధానాన్ని అమలులోకి తీసుకు వచ్చింది. దీని ద్వారా మూడు పద్ధతుల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. ప్రస్తుతం అమలులో ఉన్న పబ్లిక్ డేటా ఎంట్రీ ద్వారా అధికారిక వెబ్‌సైట్ అయిన రిజిస్ట్రేషన్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో శ్లాట్‌బుకింగ్ మ్యాడ్యుల్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా ప్రతి ఎస్ఆర్ఓ (సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం) అందుబాటులో ఉంటుంది. ఈ విషయంగా మంగళవారం కడప డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డీఐజీ డీఎస్ఆర్‌కే ప్రసాద్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ పీవీఎస్ బాబు, కడప సబ్ రిజిస్ట్రార్ హరిలు కలిసి నగరంలోని స్టాంపు వెండర్లు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రయ, విక్రయదారులందరూ అవగాహన పెంపొందించుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దశల వారీగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏప్రిల్ 30 నాటికి అమలులోకి తీసుకు వచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు.

# ఎండీయూ ఆపరేటర్లకు చెక్

- రేషన్ షాపుల్లోనే బియ్యం పంపిణీ చేయాలని ఆదేశాలు
- పొట్టకొట్టొద్దంటున్న ఎండీయూ ఆపరేటర్లు
- ప్రొద్దుటూరులోనే అమలు
- కార్డుదారులకు తప్పని ఇబ్బందులు



ఎండీయూ వాహనం ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

ప్రొద్దుటూరు : రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రొద్దుటూరు మండలంలో మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) ఆపరేటర్లను కాదని చౌకదుకాణాల డీలర్ల ద్వారానే రేషన్ పంపిణీ చేసే విధంగా అధికార పార్టీ నేతలు హుకూం జారీ చేశారు. నేతల ఆదేశాలకు అధికారులు తలూపడంతో అటు కార్డుదారులతోపాటు ఇటు ఆపరేటర్లు నష్టపోతున్నారు. ప్రొద్దుటూరు మండలంలో 144 చౌకదుకాణాలు ఉన్నాయి. ఈ చౌకదుకాణాల పరిధిలో 70వేల రేషన్ కార్డుదారులు ఉన్నారు. రేషన్ తీసుకునేందుకు కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్ల వ్యవస్థను ఏర్పాటు చేసింది. కొన్ని ప్రాంతాలతోపాటు అసలు రేషన్ షాపులు లేని గ్రామాలు కూడా ఉన్నాయి. ఆపరేటర్ల వ్యవస్థ ద్వారా ఇంటింటికి రేషన్ అందిస్తున్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాదాపుగా రేషన్ షాపులన్నీ టీడీపీ నేతలు దక్కించుకున్నారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తమ వర్గీయులకు రేషన్‌షాపులను ఇవ్వాలని అధికారులకు సిఫారసు లేఖలు పంపించారు. ఈ కారణంగా ప్రస్తుతం చౌకదుకాణాలన్నీ టీడీపీ వర్గీయుల చేతిలో ఉండగా ఎండీయూ ఆపరేటర్లు మాత్రం గత ప్రభుత్వంలో నియమించిన వారే ఉన్నారు. సాంకేతిక సమస్యలతోపాటు బ్యాంక్ లోన్ కారణంగా ఆపరేటర్లను తొలగించలేని పరిస్థితి ఏర్పడింది. ఆపరేటర్ల వ్యవస్థ ద్వారా తాము ఆదాయం కోల్పోతున్నామని భావించిన డీలర్లు అధికార పార్టీ నేతలను ఆశ్రయించి ఆపరేటర్లను నిలుపుదల చేస్తూ నేతల ద్వారా మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి స్వయంగా ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులకు చెప్పినట్లు తెలుస్తోంది. వాస్తవానికి రాష్ట్ర వ్యాప్తంగా ఎండీయూ ఆపరేటర్ల వ్యవస్థ కొనసాగుతుండగా ప్రొద్దుటూరులో మాత్రమే బ్రేక్ పడింది.

**మా పొట్ట కొట్టకండి**

తమను తొలగించి తమ పొట్ట కొట్టొద్దని ఎండీయూ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుద్యోగులమైన తాము ప్రతి నెల ప్రభుత్వం ఇచ్చే వేతనంతో జీవనం సాగిస్తున్నామన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవచ్చని, అందరి పొట్టకొట్టడం సరైన విధానం కాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆథరైజేషన్ వేస్తేనే పంపిణీ**

గత ప్రభుత్వంలో అమలు చేసిన నిబంధనల ప్రకారం గోడౌన్ నుంచి డీలర్లు సరుకును ప్రతి నెల తీసుకోవాల్సి ఉంటుంది. డీలర్ తీసుకున్న సరుకును ఎండీయూ ఆపరేటర్‌కు ఇవ్వడం, ఈ పాస్ మిషన్‌లో ఆథరైజేషన్ వేసి వారు కార్డుదారులకు పంపిణీ చేయడం జరుగుతోంది. ప్రతి ఎండీయూ ఆపరేటర్‌కు ప్రతినెల రూ.21వేలు వేతనం ప్రభుత్వం చెల్లిస్తోంది. డీలర్లకు చౌకదుకాణాలను అప్పగిస్తే ఎండీయూల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. వ్యాన్లన్నీ ఆపరేటర్ల పేరుతోనే ఉన్నాయి.

**అన్ని చోట్ల డీలర్లే పంపిణీ చేస్తున్నారు**

ప్రొద్దుటూరు మండలానికి సంబంధించి 43 మంది ఎండీయూ ఆపరేటర్లు ఉన్నారు. వీరిలో 26 మంది మున్సిపాలిటీ పరిధిలో ఉండగా 17 మంది మండల పరిధిలో ఉన్నారు. తొలి రోజు అన్ని చోట్ల డీలర్లే బియ్యం పంపిణీ చేశారు. ఈ విషయంపై సంబంధిత అధికారి మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లకు సంబంధించిన ఈ పాస్ మిషన్ ఆథరైజేషన్ ఫింగర్ వేసి డీలర్లకు అప్పగించాలని చెప్పినట్లు తెలిపారు. రేషన్ షాపుల్లో సరుకులు పంపిణీ చేయడం వల్ల కార్డుదారులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. క్యూ లైన్లు ఏర్పాటు చేయడం, గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి.

**ఇంటింటికి రేషన్ పంపిణీ చేయాలి**

ఎండీయూ ఆపరేటర్ల ద్వారా ఇంటింటికి రేషన్ పంపిణీ చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు యల్లయ్య, ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా ఇన్‌చార్జి గద్దం నరసింహ తదితరులు మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సాయినాథ్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. బడుగు బలహీన వర్గాల వారు రేషన్ షాపులకు వెళ్లి సరుకులు తీసుకోవడం కష్టంగా ఉంటుందన్నారు. వ్యవస్థను పటిష్టం చేసి సక్రమంగా ఇంటింటికి రేషన్ పంపిణీ చేయాలని కోరారు.